నందనవనం


సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో సుందరమైన స్నీపర్ పార్క్

- చిన్నాపెద్దలను రా.. రమ్మంటున్న పార్కులు
- ఆరోగ్యం.. ఆహ్లాదం.. ఆనందం ఒకే చోట
- ఉద్యానవనాల అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం
- కోట్లాది రూపాయలతో నిర్మాణం, ఆధునికీకరణ

నాడు కళావిహీనంగా తయారైన పార్కులు.. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కళకళలాడుతున్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో.. ప్రజలకు ఆనందాన్ని.. ఆరోగ్యాన్ని అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకాలకు అనుగుణంగా నగరంలోని ఖాళీగా ఉన్న జీవీఎంసీ స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేస్తున్నారు. అందాల విశాఖకు మరింత వన్నె తెచ్చేలా.. నగరవాసులకు ఆహ్లాదం పంచేలా రాష్ట్ర ప్రభుత్వం పార్కులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోంది. జీవీఎంసీ నిధులతో అవసరమైన చోట పార్కులను నిర్మించి అన్ని సదుపాయాలు కల్పిస్తోంది. ఉరుకులు.. పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు.. హాయిగా గడిపేందుకు ఉద్యానవనాలు ఎంతగానో దోహదపడతాయి. ఇంతటి ప్రాధాన్యం గల పార్కుల నిర్మాణం, అభివృద్ధికి వైఎస్ జగన్ సర్కార్ విశేష కృషి చేస్తోంది.

సీతమ్మధార: సుందరమైన నందనవనం లాంటి పార్కులకు ఉత్తర నియోజకవర్గం కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. ప్రశాంతకరమైన జీవితాన్ని గడిపేందుకు.. ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు పార్కులను ఎంతో మంది సందర్శిస్తుంటారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడుపుతుంటారు. పార్కుల్లో వాకింగ్, వ్యాయామాలు వంటివి చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటారు. చిన్నా పెద్ద, యువత అనే తేడా లేకుండా ఆట పరికరాల వద్ద సందడి చేస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటలు, వాకింగ్, జిమ్ చేస్తూ పాటు సేద తీర్చుకుంటున్నారు.

మరిన్ని పార్కుల విశేషాలు

- జోన్–3 పరిధి 14వ వార్డులోని విద్యుత్‌నగర్, కైలాసపురం, కిరణ్ పార్కు ప్రాంతాల్లో మూడు పార్కులను జీవీఎంసీ నిధులు రూ.9 లక్షలతో అభివృద్ధి చేశారు.
- సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని సాయిహిల్ స్లోప్ పార్కును రూ.15.10 లక్షలతో అభివృద్ధి చేశారు.
- నార్త్ ఎక్స్‌టెన్షన్ డబుల్ రోడ్డులో అల్లూరి సీతారామరాజు పార్కును సుందరంగా తీర్చిదిద్దారు.
- 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఇందిరా గాంధీ పార్కును రూ.8 లక్షలతో ఆధునికీకరిస్తున్నారు.



స్నీపర్ పార్క్ సూపర్



స్నీపర్ పార్క్ ముఖద్వారం

జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ప్రజలకు అనువుగా రూ.2.5 కోట్లతో స్నీపర్ పార్కు(రాకెట్ పార్క్) నిర్మించి ఇటీవల ప్రారంభించారు. దీనిలో నాలుగు వాకింగ్ ట్రాక్‌లు, సీతాకోకచిలుకల ఉత్పత్తి కేంద్రం, పిల్లల ఆట స్థలం, పరికరాలు, వర్షం ఆశ్రయాలు, నాలుగు పెర్గోలా, లిల్లీపాండ్, పెవీలియన్, టాయిలెట్స్, గెజిబో, ధ్యానం, యోగా కేంద్రాలు, యాంపి థియేటర్, నీటి సరఫరా, బిందు సేద్యం వ్యవస్థ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. నగరంలో ఒక ప్రత్యేక పార్కుగా ఇది నిలిచింది.

బృందవనంలాంటి పార్క్

జీవీఎంసీ 24వ వార్డు టీపీటీ కాలనీలోని బృందవన్ పార్క్‌ను రూ.18 లక్షలతో అభివృద్ధి చేశారు. పూర్తి స్థాయిలో అందమైన మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించారు. టెన్నిస్ కోర్ట్, చిన్నారుల కోసం జారుడు బల్ల, ఊయలలు, ఫుట్‌పాత్‌లు, బృందావన్ వేదిక, జిమ్ ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారాన్ని ప్రత్యేకంగా తయారు చేసి శివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పిల్లలకు సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రైవేట్ క్లాసులు, యోగా క్లాసులు చెబుతుంటారు. కూచిపూడి, భరతనాట్య కార్యక్రమాలు జరుగుతుంటాయి.



టీపీటీ కాలనీలో బృందావన్ పార్క్ ముఖద్వారం


నార్త్ ఎక్స్‌టెన్షన్ సాయిహిల్ స్లోప్ పార్కులో అందమైన ప్రాంగణం

పార్కును అద్భుతంగా తీర్చిదిద్దారు



టీపీటీ కాలనీలోని బృందవన్ పార్కు అద్భుతంగా తీర్చిదిద్దారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో పార్కు అభివృద్ధి జరిగింది. పార్కులో దేవీ నవరాత్రులు, ఉమెన్స్ డే, శ్రీరామ కల్యాణం, స్వాతంత్ర్య దిన వేడుకలు చేసుకుంటున్నారు. బృందావన్ పార్కులో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– గొట్టి ప్రసన్న, ప్రెసిడెంట్, టీపీటీ కాలనీ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోషియేషన్

కళకళలాడుతున్న ఉద్యానవనాలు



జీవీఎంసీ నిధులతో 14, 24 వార్డుల్లో అభివృద్ధి చేసిన పార్కులు చిన్నాపెద్దల సందడితో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా టీపీటీ కాలనీ బృందావన్ పార్కులో అనేక మొక్కలు నాటి చక్కగా తీర్చిదిద్దారు. ఈ పార్కులో పచ్చదనం బాగుంది. ప్రహరీపై అందమైన బొమ్మలు చిత్రించారు. వాకింగ్ ట్రాక్‌లో సాయంత్రం వాకింగ్ చేస్తుంటాం.

– జయప్రకాష్, టీపీటీ కాలనీ


బృందావన్ పార్కులో క్రీడా ప్రాంగణం


టీపీటీ కాలనీ బృందావన్ పార్కులో టెన్నిస్ కోర్ట్


రాకెట్ పార్కులో లిల్లీపాండ్, మొక్కలు


నార్త్ ఎక్స్‌టెన్షన్ స్నీపర్ పార్కులో వాకింగ్ ట్రాక్, పెవిలియన్

క్లుప్తంగా

ముఖ్యమంత్రి జగన్‌ను కలిసిన కాశీవిశ్వనాథ్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అమరావతిలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం నియోజకవర్గ పరిశీలకుడు కాశీవిశ్వనాథ్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవి ద్వారా పార్టీని గెలిపించే దిశగా పనిచేస్తానని చెప్పారు. - సీతమ్మధార

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు


ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరుడు

సీతమ్మధార: ఏకాదశి సందర్భంగా గురువారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు జరిపారు. భక్తులు నెయ్యి దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శేఖర్ బాబు, సిబ్బంది వనజాక్షి, శివ పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు


నామ సంకీర్తన, సత్యసాయి వ్రతంలో పాల్గొన్న భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే ఏరియా సమితి, తాటిచెట్లపాలెం భజన మండలి ఆధ్వర్యంలో గురువారం తాటిచెట్లపాలెంలో భగవాన్ శ్రీ సత్యసాయి 98వ జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం, వృద్ధులకు సేవలు, నగర సంకీర్తనలు, నామ సంకీర్తనలతోపాటు సత్యసాయి వ్రతం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్, సమితి పదాధికారులు, జిల్లా పదాధికారులు, భక్తులు, యువత పాల్గొన్నారు.

ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐగా భాస్కరరావు


బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ భాస్కరరావు

సీతమ్మధార: ద్వారకా జోన్ ట్రాఫిక్ ఎస్‌ఐగా భాస్కరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. 2015 బ్యాచ్‌కు చెందిన ఆయన.. న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్, టూటౌన్ క్రైం, వన్‌టౌన్ ట్రాఫిక్ నుంచి ద్వారకా ట్రాఫిక్‌కు బదిలీపై వచ్చారు.

ఎర్నిమాంబ ఆలయ హుండీ ఆదాయం రూ.19.26 లక్షలు

కంచరపాలెం: జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయంలో గురువారం హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహించారు. 58 రోజులకు గాను రూ.19,26,851 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హుండీ ఆదాయ లెక్కింపును పర్యవేక్షించారు.

'మా ఊరి హరికృష్ణ'కు ప్రథమ బహుమతి


షార్ట్‌ఫిల్మ్ దర్శకుడు గోవిందరాజును సత్కరిస్తున్న అక్కినేని ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

తాటిచెట్లపాలెం: దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు శత జయంత్యుత్సవాల సందర్భంగా అక్కినేని ఆర్ట్స్ అసోసియేషన్ విశాఖపట్నం బ్రాంచ్ నిర్వహించిన తెలుగు షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో మా ఊరి హరికృష్ణకు ప్రథమ బహుమతి లభించినట్లు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బోలిశెట్టి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఈ షార్ట్‌ఫిల్మ్‌కు దర్శకత్వం వహించి, ఇందులో అద్భుతంగా నటించిన అడివరపు గోవిందరాజును ఆయన అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ షార్ట్‌ఫిల్మ్‌ను ఒక ప్రముఖ సంస్థ వెండి తెరకెక్కించేందుకు ముందుకొచ్చిందని సన్మాన గ్రహీత గోవిందరాజు చెప్పారు. అక్కినేని ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యనిర్వాహక సభ్యులు నవీన్‌ప్రసాద్, షఫీ, కాకర శ్రీనివాస్, జె.ఈశ్వరరావు, బి.ఆర్.దాసు, కె వెంకటరావు, ఆంజనేయులు, గురవయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు


ప్రార్థన చేస్తున్న హేమంత్‌కుమార్, విద్యార్థులు

తాటిచెట్లపాలెం: సంగం శరత్ థియేటర్ జంక్షన్ వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడిన విద్యార్థులు త్వరగా కోలుకోవాలని ద్వారకానగర్ బీవీకే కాలేజీ సమీపంలో ఏయూ విద్యార్థి నాయకుడు సమయం హేమంత్‌కుమార్, తల్లిదండ్రుల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మృత్యుంజయ మంత్రం పఠిస్తూ, దైవ ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ ఉదయం అరు గంటలతో భారీ వాహనాల రాకపోకలు ఆపాలని, ఆటో వెనుక భాగంలో లగేజీ, స్కూల్ బ్యాగులు మాత్రమే ఉంచాలని, విద్యార్థులను ఎక్కించకూడదన్నారు. ఈ విధంగా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్యూషన్ టీచర్లు సుప్రియ, కమల, విద్యార్థులు ధన్వి, శ్రీకరి, మింది కృష్ణ, హర్షిత, లోహిత్, ప్రజయ్, మోహిత్ వెంకట్, నిహార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ గౌరవ సలహాదారుడిగా త్రినాథరావు


కల్పలతా రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

విశాఖ విద్య: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా అల్లూరి జిల్లా అరుకు ఎంఈవో–1 వంతల త్రినాథరావు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ రెడ్డి, కార్యదర్శి సుధీర్ నియామకాన్ని ప్రకటించారు. గెజిటెడ్ అధికారి హోదా గల వంతల త్రినాథరావు సేవలను సంఘం అభివృద్ధికి ఉపయోగించుకుంటామని వైఎస్సార్ టీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు చొక్కాకుల సూర్యనారాయణ తెలిపారు. గురువారం ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డిని కలిసి సంఘం బలోపేతంపై తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఎమ్మెల్సీని సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు.

'విభజన హామీలపై మాట్లాడండి'

డాబాగార్డెన్స్: రాజకీయ పార్టీలు విభజన హామీలపై మాట్లాడాలని ఏపీ ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి ప్రతినిధులు ప్రొఫెసర్ అప్పలనాయుడు, చలసాని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఏ ఒక్క రాజకీయ పార్టీ నాయకుడు కూడా ప్రత్యేక హోదా, విభజన హామీలపై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా విమర్శలే తప్పా.. విభజన హామీలపై మాట్లాడడం లేదన్నారు. ఈ సమయంలో కూడా రాష్ట్రం కోసం పట్టించుకోకపోతే ఎలా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఎం.జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తులకు వెండి కిరీటాల అలంకరణ


సంపత్ వేంకటేశ్వర స్వామికి అలంకరించిన వెండీ కిరీటం

కంచరపాలెం: గొల్లకంచరపాలెంలో కొలువైన సంపత్ వేంకటేశ్వర స్వామి, కోదండ సీతారామ స్వామి, ధనలక్ష్మీదేవి మూల విరాట్ దేవతామూర్తులకు గురువారం ప్రబోధిని ఏకాదశి సందర్భంగా వెండి కిరీటాలు అలంకరించారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, దాతల నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వేద పండితులు శాస్త్రోక్తంగా సంప్రోక్షణ పూజలు జరిపించారు. దాతలు నమ్మి రాజా రమేష్ రేవతి, నమ్మి చంద్రమోహన్, దాడి వెంకటరత్నం కిరీటాలు బహూకరించారు. మధ్యాహ్నం కమిటీ సభ్యులు భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి


సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే 2024లో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా రావాలని 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం 1086120 సచివాలయం పరిధి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని తమిళ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం ప్రారంభమైంది. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాల తెలిపే డిజిటల్ బోర్డును, పార్టీ జెండాను అనిల్‌కుమార్‌రాజు ఆవిష్కరించి మాట్లాడారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, పార్టీ మండల అధ్యక్షురాలు జి.వి.ర మణి, 14వ వార్డు నాయకులు కె.సత్యనారాయణ, బి.శ్రీను, కె.సుశీల, బల్ల శ్రీనివాసరావు, సతీష్, తులసీరాం, లింగేశ్వరరావు, ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మురళీనగర్: జోన్–2 డివిజన్ పరిధిలోని కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్‌లో ఏఎల్59 జీబ్రా కండక్టర్ మార్పిడి పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జయప్రకాష్‌నగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్య కాలనీ, కప్పరాడ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఎస్ఎస్‌టీఎల్ ఫీడర్ల పరిధిలో..

ఎస్ఎస్‌టీఎల్ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ(ఆపరేషన్స్) బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మర్రిపాలెం వుడా లేఅవుట్, శివశివాని స్కూల్, పోలీస్ క్వార్టర్స్, పీఎఫ్ క్వార్టర్స్, లీడర్ కార్యాలయ ప్రాంతం, భాస్కర్ గార్డెన్స్, శివనగర్, ఎఫ్‌సీఐ కాలనీ, మర్రిపాలెం మెయిన్ రోడ్, గవర వీధి, గొల్ల వీధి, రాణాప్రతాప్ నగర్, శ్రీనివాసనగర్, హుస్సేన్ నగర్, రైల్వే క్వార్టర్స్, నరేంద్రనగర్, ఓల్డ్ కరాస, న్యూ కరాస, శాంతినగర్, అంబేడ్కర్ నగర్ కాలనీ, నేతాజీ కాలనీ, రామ్‌నగర్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, ఎస్‌పీడీ–1 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రైల్వేల ప్రైవేటీకరణ ఆపాలని ధర్నా



రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: భారత రైల్వేల ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని సీఐటీయూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కమిటీ ఆధ్వర్యంలో గురువారం విశాఖ రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారతీయ రైల్వేను అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరలకు ప్రయాణం కల్పించి కొన్ని కోట్లమందిని గమ్య స్థానాలకు చేరుస్తున్న గొప్ప భారతీయ రైల్వేను ప్రైవేటుపరం చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఇప్పటికే పలు రైళ్లు, రైల్వే ట్రాక్‌లు, రైల్వే స్టేషన్లను మోదీ సర్కార్ అదానీకి కట్టబెట్టడంతో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.జగన్, ఎం.సుబ్బారావు, నాయకులు వై.రాజు, డి.కొండమ్మ, కె.పెంటారావు, ఒమ్మి అప్పారావు, కె.సత్యనారాయణ, చంద్రమౌళి, యు.ఎస్.ఎన్.రాజు, కె.కుమారి, ఎన్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.